క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

సీతానగరం: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పయ్యపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న మంచినీటి పథకాల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలందరూ తాగునీటిని పొదుపు చేయాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.


పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ బాలకృష్ణ, ఎస్సై నారాయణరావు

పాచిపెంట: మండలంలో కన్నయ్యవలస, చిట్టెలబ, మిలియకంచూరు, బొర్రమామిడి తదితర గ్రామాల్లో రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్సై నారాయణరావు శుక్రవారం పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి వసతులపై ఆరా తీశారు. ఓటు హక్కును అందరు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



కొత్తవలసలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

పాచిపెంట: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాచిపెంట ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలో విస్తృతంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. కొత్తవలస, మిర్తివలస గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అందరూ బాధ్యతగా నడుచుకోవాలని కోరారు.

రాయగడ జమ్ములో పశువైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో పశుసంవర్ధక శాఖ, నాబార్డ్ జీవ ప్రాజెక్ట్(జట్టు సంస్థ) సంయుక్తంగా శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, లక్షణాలు, నివారణ చర్యలపై పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు పాడిరైతులకు అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో పశువులు తాగేందుకు నీరు అందుబాటులో ఉండేలా చూడాలని, శాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రబోధ్, జి.మురళీమోహన్ ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

పాలకొండ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సీనియర్ సహాయ అధికారి లక్ష్మీనరసింహ కోరారు. పట్టణంలోని 166, 167 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎంలపై ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఓటు హక్కు ఉన్నవారు పోలింగ్ రోజున విధిగా ఓటు వేయాలని, ఓటింగ్ శాతం పెరిగేందుకు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, తదితరులు

కొమరాడ: మండలంలోని చినఖేర్జిల గ్రామంలో కేంద్రగల రవికుమార్(గిరి) సంబంధించిన పూరిల్లు గురువారం అగ్నికి ఆహుతయ్యింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతో పాటు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, కొమరాడ, శివిని పీఏసీఎస్ చైర్మన్లు మరడాన సూరపనాయుడు, పప్పల గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, శెట్టి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి సంతకం..

- గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షం
- గ్రామాల్లో పక్కాగా పారిశుధ్య పనులు
- తాగునీటి ఎద్దడి నివారణకు 808 రక్షిత తాగునీటి పథకాలు, 11 సమగ్ర తాగునీటిపథకాలు
- సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం



పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో ఇంటింటి కుళాయి పనులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పార్వతీపురం టౌన్:

పల్లె ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న సచివాలయాలు.. అర్హులందరికీ సకాలంలో పథకాలు చేరువ చేసే వలంటీర్ వ్యవస్థ.. ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు.. ఇంటింటికీ వైద్య సేవలు అందించే ఫ్యామిలీ డాక్టర్లు.. రైతులకు సేవలందించే ఆర్బీకేలు.. నాడు–నేడుతో మారిన బడి రూపురేఖలు.... తాగునీటి సమస్యకు చెక్ పెట్టేలా జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయిలు.. ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ.. గ్రామాల్లో నిర్మించిన రోడ్లు, కాలువలు, భవన నిర్మాణాలతో పల్లెల రూపురేఖలు మారాయి. పల్లెలకు పట్టుకొమ్మలైన పంచాయతీలను అభివృద్ధిపథంలో తీసుకువెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిది. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయాల ద్వారా తీసుకువచ్చి గ్రామ ప్రజలకు చేరువ చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వేసవికాలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తరాదన్న లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం పూర్తి ప్రణాళికలతో ముందుకు సాగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 45 రోజుల ముందస్తు ప్రణాళికలు రూపొందించి చేతిపంపులు, రక్షిత తాగునీటి పథకాలను పరిశీలించి మరమ్మతులు జరిపించింది. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో ఇబ్బందులు పడకుండా బోర్లకు మరమ్మతులు చేపట్టారు.

అంటువ్యాధులు ప్రబలకుండా డ్రై డే..

గ్రామాల్లో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పారిశుధ్యం మెరుగుకు చక్కని ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అధికారులు ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 452 పంచాయతీల్లో క్రమం తప్పకుండా ప్రతీ శుక్ర, శనివారాల్లో డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యసిబ్బంది సమన్వయంతో నిర్వహిస్తున్నారు. వ్యాధులకు కారణమైన దోమల వృద్ధికి చెక్‌పెడుతూ గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పూర్తి చర్యలు చేపట్టారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. నాలుగేళ్లగా జిల్లాలో రహదారుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గిరిశిఖర గ్రామాల ప్రజలకు డోలీ కష్టాలు తొలగాయి. తాజాగా సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని గిరిజన గూడలకు ఐదు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆర్‌ఎస్‌పీఎల్‌డబ్ల్యూఈఏ కింద పనులను చేపడుతున్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 16.09 కిలోమీటర్ల మేర ఈ ఐదు రహదారులను రూ. 16.56 కోట్లతో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

జిల్లాలో తాగునీటి పథకాలు ఇలా...

మండలాలు	:	15
ఆవాస గ్రామాలు	:	2,282
చేతి పంపులు	:	7,518
సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు	:	11
రక్షిత తాగునీటి పథకాలు	:	808
మినీ రక్షిత తాగునీటి పథకాలు	:	491

గ్రామాల్లో రహదారి నిర్మాణాలు ఇలా..

ఐటీడీ పరిధిలో 1102 గ్రామాలకు : 511 జీటీ రోడ్లు
167 గ్రామాలకు : 162 గ్రావెల్ రోడ్డులు
రోడ్డు సదుపాయం లేని 262 గ్రామాలకు : రూ.256 కోట్ల వ్యయంతో 345 కి.మీ రోడ్లు
గిరిశిఖర గ్రామాల్లో మిషనరీ పనులకు : రూ. 16కోట్లు

అభివృద్ధి దిశగా గ్రామాలు..



గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధిపథంలోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. సచివాలయ వ్యవస్థ ఏర్పడడం ద్వారా గ్రామంలోనే అన్ని పనులు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, మంచినీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. – పెంద స్రవంతి, సర్పంచ్, గోపాలపురం పంచాయతీ

గ్రామల్లోనే సేవలు..



గతంతో పోల్చుకుంటే గ్రామం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయి. వైద్యానికి సంబంధించి నెలలో రెండుసార్లు వైద్యులే వచ్చి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలంతా సంతృప్తికరంగా ఉన్నారు. – యాంద్రాపు ఉషారాణి, సర్పంచ్, కవిటిభద్ర పంచాయతీ



పార్వతీపురం మండలం గోచక్క గ్రామంలో చెత్త సేకరణలో గ్రీన్ అంబాసిడర్లు (ఫైల్)



సీతానగరంలో డ్రై డే కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు (ఫైల్)



గుమ్మలక్ష్మీపురం మండలంలో గిరిశిఖర గ్రామాలకు వేసిన రహదారి (ఫైల్)

సీఎం జగన్‌తోనే సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదబోరబంద గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. గడపగడపలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలు మోసం చేసిన చంద్రబాబునాయుడును ప్రజలు మరోసారి నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి సాలూరు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. జగనన్న పాలనలో గిరిజన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించామని, మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. ఐదేళ్లలో సాలూరు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించామన్నారు. అన్ని పంచాయతీల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలను నిర్మించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ, శివరాంపురం ఎంపీటీసీ కల్లేపల్లి త్రినాథ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



పట్టణంలోని 23వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రతి పేద కుటుంబం అభివృద్ధి చెందాలంటే జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 24వ వార్డులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024లో పెత్తందార్లకు, పేదవారికి మధ్య ఎన్నికల జరుగుతోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. ప్రజలందరికీ మంచి చేసే మనసున్న మారాజు జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిల్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించాలి...

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని వెంకంపేట పంచాయతీలో రెండో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా.. సంక్షేమం కొనసాగాలన్నా.. వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. విద్య వైద్య రంగాలకు పెద్దపీట వేసిన జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, వైస్ ఎంపీపీ సిద్ద జగన్నాథరావు, బంకురి రవికుమార్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బడే రామారావు, జేసీఎస్ కన్వీనర్ బి. వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మువ్వల సత్యంనాయుడు, జిల్లా జనరల్ సెక్రెటరీ వి. గురురాజు, తాన్న శ్రీరాములు, గణేష్, సాయి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వెంకంపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగనన్నను ఆశీర్వదించండి



మాతుమూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాచిపెంట: ఫ్యాను గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు తదితరులు కోరారు. మండలంలో మాతుమూరు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతివ్వాలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తప్పుడు హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న టీడీపీ మాటలను నమ్మొద్దని కోరారు. జగన్ మళ్లీ సీఎం అయితే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, మీ పిల్లల భవిష్యత్ బాగుంటుందని అన్నారు. విశ్వనాథపురంలో జేసీఎస్ కన్వీనర్ టి.గౌరిశ్వరరావు, తదితరులు ప్రచారం చేశారు.

పంచ కుల వృత్తులను చేదోడులో చేర్చాలి

భామిని: మండలంలోని బాలేరులో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆగూరు సంజీవ్ ఆచారి అధ్యక్షతన శుక్రవారం పంచకుల వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. చేతి వృత్తులే ఆధారంగా జీవించే విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందలేదని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం తీర్మించింది. పంచ కుల వృత్తులు చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి వైఎస్సార్ జగనన్న చేదోడు పథకంలో చేర్చాలని, కుల వృత్తులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని కోరారు. మండల సంఘ నాయకులు ఆగూరు కృష్ణ, సింహాద్రి రమేష్, రీసి శంకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉండగా.. దాన్ని ఏప్రిల్ 6 వరకు ప్రభుత్వం పొడిగించిందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష యథావిధిగా ఏప్రిల్ 21న ఆయా మండలాల ఏపీ మోడల్ స్కూళ్లలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పలు పంచాయతీల్లో ఎమ్మెల్యే ప్రచారం

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల, విక్రమపురం, కంబరవలస, నడుకూరు పంచాయతీల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మక్కువ: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై పి.నరసింహమూర్తి కోరారు. మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో శుక్రవారం ఎస్టీఎఫ్ బలగాలతో కలిసి ఏరియా డామినేషన్, ఆర్‌వోపీ(రోడ్డు ఓపెనింగ్ పార్టీ) కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కల్వర్టులు, అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. ఎక్కడైనా సారా తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారా అని నిశితంగా పరిశీలించారు. ఏరియా డామినేషన్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు, ప్రజలకు ఎన్నికల కోడ్, ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలకు తావివ్వకుండా ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరసింహమూర్తి

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే



పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఆర్‌సీఎం చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు



మక్కువ: మండల కేంద్రంలో శిలువను మోసుకుంటూ వెళ్తున్న క్రీస్తు విశ్వాసకులు

సీతానగరం: మండలంలోని క్రైస్తవలు గుడ్ ఫ్రై డే భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. ఈ మేరకు బూర్జ, పెదంకలాం, అంటిపేట, మరిపివలస, జోగింపేట, గుచ్చిమి, జానుమల్లువలస, గాదెలవలస, సీతానగరం, పెదబోగిలి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు గ్రామల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీసస్ చెప్పినట్లు ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు సేవకులు పాల్గొన్నారు.

ఊరేగింపు..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం – మన్యం జిల్లా కేంద్రంలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏసు శాంతి సందేశాలను వినిపించారు. శిలువ రూపంలో ఉన్న ఏసును ఊరేగింపు చేశారు. ఆరాధన గీతాలను స్తుతించారు. కరుణామయుడి పరమత సహనం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌సీఎం, సీబీఎంతో పాటు పలు ఏసు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సీతానగరం: పెదబోగిలి లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సీఎం చర్చిలో గుడ్ ఫ్రై డే వేడుకలు

సాలూరు: గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని చర్చిల్లో క్రీస్తు విశ్వాసకులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కీర్తనలు ఆలపిస్తూ క్రీస్తును స్తుతించారు. ఏసుక్రీస్తు శిలువ చేయబడిన ఇతివృత్తాన్ని ప్రదర్శించారు.

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేని ఏసుక్రీస్తు విశ్వాసకులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాసం ఆచరించి ప్రార్థనలు చేశారు. మక్కువ ఆర్‌సీఎం వీధి నుంచి ఆర్‌సీఎం చర్చ్ వరకు ఏసుక్రీస్తు వేషాధారణతో శిలువను భుజాలపై మోస్తూ ర్యాలీ నిర్వహించారు. చర్చి పాస్టర్స్, ఫాదర్ ఏసుక్రీస్తు సందేశాన్ని విశ్వాసకులకు వినిపించారు.



సాలూరు: సెయింట్ థెరిసా చర్చి వద్ద శిలువపై క్రీస్తు విశ్వాసకుడు